

# తప్పెవరిది?

బి. కమల

ఆ ఊరికి మాకు ట్రాన్స్‌ఫర్ అయిన క్రొత్త. ఇంకా ఎవరితోనూ పరిచయం కాలేదు. ఆ కట్టూ, బొట్టూ, భాషా చూస్తూ వింటూవుంటే నాలుగురోజులు దాకానే వున్నదిగానీ, చూసినదే చూడాలంటే ఇప్పుడు బోర్ కొడ్తోంది. డాబామీద కెక్కి ఏమీతోచక పచార్లు చేయసాగాను. నేను గుంటూరులో చదువుకునేటప్పుడు కాలేజీలో మేమంతాచేరి లెక్చరర్లకు రకరకాల నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపించే వాళ్ళం. ఒక లెక్చరర్‌గారికి మీసాలు బొద్దింకమీసాల్లాగా సన్నగా పొడుగ్గా వుండేవి. ఆయన వెళ్తుంటే బొద్దింకగారూ, అని కేకపెట్టేవాళ్ళం. ఆయన మొదట్లో గాభరాగా అటూ యిటూ చూసేవారు కానీ రానురాను తల వంచుకొని వెళ్ళిపోయేవారు. అప్పటి విషయాలు గుర్తుచేసికొంటూ నాలోనేనే నవ్వుకుంటున్నాను. ఇంతలో కారు హారన్ బోయ్ మంటూ వినిపించింది. ఉలిక్కిపడి పక్కింటివైపు చూశాను. సరిక్రొత్త స్టాండర్డ్‌లోనుంచి డాక్టర్‌గారు కాబోలు దిగి లోపలికి వెళ్ళుతున్నారు. మా పక్కింట్లో డాక్టర్ ఆనంద్, యం. బి. బి. యస్ అన్న బోర్డు చూశానుగానీ ఆయనను ఇంతవరకూ చూడలేదు. కానీ ఆయన ఇంటిసంగతులు మా మలయాళీ పనిమనిషి ద్వారా కొద్దిగా తెల్సినయ్. ఆయనకు మూడుకార్లున్నట్లు, ఆ వూళ్ళోనే రెండు మేడలున్నాయని, ఐతే ఆయనకు భార్యాబిడ్డలు లేరని - ఇవీ నేను సేకరించిన విషయాలు. రోజుకు దాదాపు 16 గంటలు పనిచేస్తూనే వుంటారట. బీదా బిక్కీని విచారిస్తారట. ఎంతో హుషారుగా వుంటారట - ఇవి ఆయన గురించిన పొగడ్తలు. ఆయనతో ఎట్లాగైనా పరిచయము చేసికోవాలని నాలుగురోజుల్నుంచీ ప్రయత్నిస్తున్నాను. కనీసం ఆయన ముఖపరిచయమైనా లేందే మాటలు కలపాలంటే ఎలాగా అని ఆలోచిస్తున్నాను ఇంతలో క్రిందనుంచి మా తమ్ముడు పెట్టిన కేకతో నా వూహాసౌధాలలో నుంచి బయట పడ్డాను.

తోచీ తోచకుండానే ఓ వారంరోజులు గడిచి పోయినై. ఇంతలో మా చెల్లికి జ్వరం రావటం మొదలెట్టింది. మా నాన్నగారేమో కేంప్ వెళ్ళారు. అప్పటికీ మా అమ్మ ఏవో చిట్కాలు వాడింది. ఏమీ తగ్గుముఖం పట్టకపోగా ఎక్కువైంది. మేమంతా గాభరా పడ్డాం. ఇంతలో మా పక్కింటి డాక్టర్ సంగతి గుర్తుకొచ్చింది. గబగబా వెళ్ళాను నా అదృష్టమేమో పేషెంట్లెవరూ లేరు. ఆయన ఒక్కరే కూర్చుని ఏదో వ్రాసుకొంటున్నారు. నే వెళ్ళగానే నా మామూలు అలవాటు చొప్పున తెలుగులో "నమస్కారమండీ" అని గబుక్కున నాలిక కరచుకొని ఇంగ్లీషులో విష్ చేసి మా చెల్లి సంగతి చెప్పాను. ఆయన వెంటనే తెలుగులో నన్ను ఆహ్వానించి "నేను తెలుగువాడినే" అని "మీ సంగతి ఏమిటో యిప్పుడు వివరంగా చెప్పండి" అన్నారు. ఈ పది రోజుల్నుంచీ ఎవరి నోట్లోనుండి తెలుగుమాట వినని నాకు ఎంతో సంతోషం వేసింది. కాని యిటువంటి పరిస్థితిలో అయినందుకు విచారం వేసింది. నా పేరు, నాన్నగారి పేరు అడిగి తెలుసుకున్నారు. నేను వచ్చిన సంగతి తెల్సుకొని హడావిడిగా లేచి తన మెడికల్ కిట్ పట్టుకొని నా వెంట బయల్దేరారు. ఆ హడావుడిలో ఆ కిట్ నేను పట్టుకోవాలన్న ధ్యానమే నాకు లేకపోయింది

మా చెల్లిని పరీక్ష చేసి "ఇది టైఫాయిడ్" అని చెప్పారు. మా అమ్మవైపు చూశాను. ఆవిడ ఆ మాట వినగానే భయంతో ఏడవసాగింది. నాకు కూడ కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. డాక్టరుగారు మా యిద్దరివైపు చూసి, సానుభూతిగా నా చెయ్యి పట్టుకుని "చూడండి మిస్టర్! చదువుకున్నవారు. మీ అమ్మగారికి ధైర్యం చెప్పవల్సింది పోయి మీరే ఇలా బెంబేలు పడితే ఎలా? పైగా మీ నాన్నగారు కూడ వూళ్ళో లేరని చెప్పారు కదా! ఈ రోజుల్లో ఈ జబ్బుకి భయపడవలసిన పనిలేదు. మంచి మంచి మందులున్నాయి" అని చెప్పారు. అప్పుడు నా కర్తవ్యము గుర్తుకొచ్చి మా అమ్మను అవతలికి తీసికెళ్ళి ఓదార్చాను. తర్వాత రోజూ రెండుపూటలా వచ్చి చూసి, మందులిచ్చి ఎట్లావాడాలో వివరంగా చెప్పి

---

వాలి. కాని అద్దె యిల్లయినప్పటికీ అశ్రద్ధ చేయకూడదు. మన యింటి నెంత శుభ్రంగా వుంచుకుంటామో, మన యింటి ఆవరణలోకూడ (చుట్టు ప్రక్కల) కూడ అంతా శుభ్రంగా వుంచుకోవాలి. కొందరు యింటిముందర వాకిళ్ళు ప్రక్కలా చాల అసహ్యకరంగా వుంటాయి. అలా వుంచటం మనకూ, పరిసర ప్రాంతములవారికీ కూడ అంటు వ్యాధులు సోకుతాయి. ఇంటి నెంత అందంగా అమర్చుకుంటే అంతఆకర్షణీయంగా వుంటుంది. కొంతమంది చదువుకున్నవారు కూడ బద్ధకంతో, యింటి పనులయందు శ్రద్ధ చూపరు. అలాకాకుండ ప్రతి స్త్రీ తమ పనులను తామే చేసుకోవటంలో తప్పులేదు. "ఇంటిని చూచి యిల్లాలిని చూడు" అనే సామెత కూడ వుందికదా. ★

వెళ్ళేవారు. మా చెల్లికి పథ్యం పెట్టాక కూడ నాలుగురోజులు వచ్చి చూస్తూండేవారు. మా చెల్లి జ్వరము వల్లనైతే ఏమీ నాకూ, డాక్టర్‌గారికి బాగా పరిచయం పెరగసాగింది. నన్ను యిప్పుడు డాక్టరుగారు "ఏమోయ్ రమణా!" అనికూడ పిలుస్తున్నారు. దాదాపు మా నాన్నగారి యీడు మనిషిని "నీవు" అనలేకపోయేవాడిని. అందు వల్ల "ఆనంద్‌గారూ", "డాక్టర్‌గారూ" అని పిలిచేవాడిని. ఆయనకు తన సంతానము లేక పోయినా యింటినిండా అన్నగారి పిల్లలు, మేనమామగారి పిల్లలు రకాల వారీగా వుండేవారు.

డాక్టర్‌గారిది ఎంతో పెద్దయిల్లు. కానీ ఆయన వుండే గదులు డిస్పెన్సరీ యింటికి దూరంగా వుండేవి. వాళ్ళ బంధువుల పిల్లలెవరూ యిటు వైపు వచ్చేవారు కారు. నాకు మాత్రం ఆయన సర్వ స్వాతంత్రం ఇచ్చేవారు. హాయిగా ఆయన డ్రాయింగ్ రూమ్‌లో కూర్చొని మంచి నవల్ని చదువుకుంటూ వుండే నాకు బాగా కాలక్షేపం జరిగసాగింది.

ఒకరోజు ఏమైనా క్రొత్త నవల దొరుకుతుందేమోనని ఆయన బీరువా అంతా వెదుక సాగాను. చక్కని ఫొటో ఆల్బమ్ దొరికింది. అరె! డాక్టర్‌గారు నా కెప్పుడూ చూపించలేదే అని కూర్చొని చూడసాగేను. చక్కని ప్రకృతి దృశ్యాలు, వాళ్ళ బంధువుల ఫొటోలు చూస్తూ, ఒక పెళ్ళి ఫొటో చూసి ఆగిపోయాను. డాక్టరుగారు, ప్రక్కనె ఆయన భార్య కాబోలు బొద్దుగా, అందంగా, శాంతంగా చూస్తున్న కళ్ళతో చాల బాగుంది. కాసేపు చూసి పేజీ తిప్పాను. ప్రక్కపేజీలో ఇంకొక పెళ్ళి ఫొటో వుంది. ఇదేమిటి రెండుచోట్ల వేశారని పరిశీలనగా చూసేసరికి అక్కడ సన్నగా, చలాకీగా, సినిమా స్టారు లాంటి అమ్మాయి డాక్టర్‌గారి ప్రక్కన బుగ్గన చుక్క, పూలమాలతో వుంది. నేను ఆశ్చర్యమునుండి తేరుకోకమునుపే డాక్టరుగారు వచ్చేశారు. "ఏమోయ్! ఏమిటంత తీవ్రంగా చూస్తున్నావు? కథానాయిక దొరకలేదా?" అంటూ లోపలికొచ్చారు. నా చేతిలో ఆల్బమ్‌చూసి వులిక్కిపడి గిరుక్కున వెనక్కి తిరిగి వరండాలో వున్న పడక్కుర్చీలో అలాగే వాలిపోయారు. నాకు కొంచెం భయమేసింది. ఎంత స్వతంత్రమిస్తే మాత్రం అవన్నీ సవరించి, ఆయన రహస్యంగా దాచుకున్నవి బయటకు తీయటం నాదే తప్పని తలవంచుకొని ఆల్బమ్ బీరువాలో పెట్టి, మెల్లగా మా యింటికి వచ్చేశాను.

* * *

మరునాటిరోజు డాక్టరుగారింటికి వెళ్ళి క్షమాపణలు చెప్పుకుందామని వెళ్ళాను. నేను వెళ్ళేసరికి డాక్టర్‌గారు టేబుల్ ముందు కుర్చీలో కూర్చొని రెండు చేతులతో తలపట్టుకొని ఎంతో దుఃఖపడ్తున్నట్లున్నారు. నేను మెల్లిగా దగ్గాను. ఆ సవ్వడికి ఆనందుగారు మెల్లిగా తలయెత్తి నా వైపు నిర్లిప్తంగా చూశారు. "నా పొరపాటు క్షమించండి ఏదైనా మంచి పుస్తకం దొరుకుతుందేమోనని వెదుకుతుంటే ఆల్బమ్ కన్పించింది. కుతూహలము ఆపుకోలేక చూశాను." అంటూ తడబడుతూ చెప్పాను. దానికి ఆయన భారంగా తలవూపుతూ "చూడు రమణా! దీనికి నీవేమీ బాధపడకు. ఇది ఎన్నో యేళ్ళుగా నాలో పేరుకున్న బాధ. నాకంటె చిన్నవాడివయినా నీతో నేనెంతో ఆత్మీయమైన స్నేహం చవిచూశాను. ఇంతవరకు నా మనస్సులోని బాధను నాలోనే దిగమింగుతూ పైకి ఏమీ బాధలు లేని వానిగా చెలామణి అవుతూ, తెచ్చిపెట్టుకున్న వుత్సాహంతో తిరుగుతున్నాను" అంటూ మెల్లగా వెనక్కివాలి "అదేమిటి, అలానిలబడే వున్నావు. కూర్చో. ఇవ్వాళ ఎక్కడికీ కదలదల్చుకోలేదు. ఆ ఆల్బమ్ కథ అంటే నా జీవిత చరిత్ర చెబుతాను. కూర్చో" అన్నారు. నాలో కూడా ఆపుకోలేని కుతూహలము బయల్దేరింది. కుర్చీ ఆయన దగ్గరగా జరుపుకొని కూర్చున్నాను.

డాక్టర్‌గారు కాసేపు కళ్ళుమూసుకొని ఆలోచిస్తున్నట్లుగా వుండి మొదలు పెట్టారు.

"అవినేను కాలేజీలో చదువుకొనే రోజులు. మేమంతా కాకినాడలో వుండేవాళ్ళం. మానాన్నగారు పెద్ద ప్లీడరు. చాలా ఆధునిక భావాలు కలవారు. మా అమ్మగారుకూడ ఆయనకు సమవుజ్జీగా వుండేవారు. మా నాన్నగారు చాల ఆస్తి సంపాదించారు. నేను హైస్కూలు చదువులో వుండగానే మా యింట్లో మార్పు రాసాగింది. ఆంగ్ల పద్ధతిలో జరిగే మా యింటి మర్యాదలు అతిసాధారణంగా మారసాగినయ్. మానాన్నగారు ప్రాక్టీస్ మానివేశారు. ఖద్దరు బట్టలు కట్టడం, అప్పుడప్పుడు జైళ్ళకు పోయిరావటం జరుగుతూ వుండేది. నేనంతగా పట్టించుకునేవాడిని కాదు.

కాని నేను ఎం. బి. బి. యస్. ఫస్ట్ ఇయర్ చదువుకునే రోజుల్లో మా నాన్నగారు బ్రహ్మసమాజంలో చేరడం నాకెంతో సంతోషం కల్గజేసింది. కులమత భేదాలు లేని ఆ మతమంటే నాకెంతో యిష్టంగా వుండేది. తరచూ అక్కడ జరిగే కార్యక్రమాలకు హాజరయేవాడిని. అటువంటి సమయంలోనే పరిమళతో పరిచయమైంది. తను భోగం వాళ్ళ పిల్ల. తండ్రి నాయుడు. తల్లి భోగం కులపు మనిషి. వాళ్ళు పెళ్ళి చేసుకోలేదు గానీ మొదటినుంచి జీవితాంతం వరకు విడిపోలేదు. తరచు నేను, పరిమళ కల్సుకుంటూండే వాళ్ళం. మా మధ్య యేవేవో సంభాషణలు జరుగుతూ వుండేవి. చివరకు ఒకళ్ళను చూడకుండా మరొకళ్ళం ఒక్కరోజుకూడ వుండలేని స్థితిలోకి దిగాము. మా విషయం మా తల్లిదండ్రులతో చెప్పాము. మా నాన్నగారు ఒప్పుకోరనుకున్నా. కానీ ఆయన సంతోషంతో అంగీకరించటం ఎంతో హాయనిపించింది మా పెళ్ళి ఎలాటి ఆర్భాటము లేకుండా ఎంతో నిరాడంబరంగా జరిగింది. పరిమళగూడ బి. ఎ. చదువుతూ వుండేది ఒక సంవత్సరము ఎంతో హాయిగా జరిగిపోయింది. ఇంతలో మా నాన్నగారు పోయారు. ఆ దిగులుతోనే మా అమ్మ గారు కూడ నెల్లైనా జరుగకుండానే పోయారు. నా బాధ వర్ణనాతీతం. అటువంటి సమయంలో పరిమళ నన్ను ఎంతగానో ఓదార్చింది. నా దుఃఖము కొద్దికొద్దిగా తగ్గుతున్న సమయములో నాకు తెల్సిందేమిటంటే మా ఆస్తిపాస్తులన్నీ హారతి కర్పూరంలా హరించుకు పోయినవని, నాకు నిలువ నీడ కూడలేదని. నా చదువు మూడవ సంవత్సరములోకి వచ్చింది. ఏమి చేయాలో నాకేమీ పాలుపోలేదు.

అటువంటి సమయంలో పరిమళ ధైర్యం చెప్పి తను చదువు మానేసి ఒక టీచరు ఉద్యోగం సంపాదించింది. నన్ను చదువు మానవద్దని, మూడు సంవత్సరాలు కళ్ళు మూసుకుంటే ఆ తర్వాత హాయిగా వుండవచ్చని అంటూ నేనెంత కాదన్నా వినిపించుకోకుండా తను కష్టపడి నన్ను చదివించింది. నీ కేమైనా విసుగ్గా వుందా నా కథ?" అంటూ డాక్టరుగారు పలకరించటంతో నేను తేరుకొని "అబ్బే లేదు మిగతా కథకూడ చెప్పండి వింటాను" అన్నాను.

నేను అలా అన్నందుకు డాక్టరుగారు నవ్వి, "ఆ తర్వాతే వచ్చింది అసలు పరిస్థితి. నేను నా చదువు ముగించుకొని ప్రాక్టీసు పెట్టాను. కొత్తలో అంత బాగా జరుగకపోయినా రానురాను ఎంతో బాగా పెరిగిపోసాగింది. ఇంతలో మా పెదనాన్నగారి కొడుకులుకూడా మా వూరికే వుద్యోగ నిమిత్తం వచ్చారు. నేను తరచు వాళ్ళింటికి వెళ్ళి వస్తూండేవాడిని పరిమళకూడా రెండుమూడుసార్లు వచ్చిందే కానీ వాళ్ళేదో చిన్నతనంగా చూసే వాళ్ళని తను రావటం మానేసింది. మా వదిన నాతో మెల్లమెల్లగా పరిమళమీద ఏవేవో సంగతులు చెప్పి మెల్లగా తనంటే అసహ్యం కలుగజేయసాగింది. పైగా "నీవు లక్షణంగా బ్రాహ్మణుడివి. ఆ భోగము పిల్లతో నీ కేమిటి? మనకు చూడు తలలో జుట్టంత బలగముంది. వాళ్లెవరైనా నీ యింటికి వస్తున్నారా? ఏదో యిన్ని రోజులు తెలియక దాని చేతి అన్నము తిన్నావు. ఇకనన్నా మానేయి. దాన్ని ఎలాగో వెళ్ళగొట్టు" అంటూ అదే పనిగా నూరిపోయసాగింది. పదిరాళ్ళు వేస్తే ఒక్క రాయన్నా తగులుతుందన్న సామెతలాగా నా కళ్ళకు పొరలు కమ్మి ఆమె మాటలన్నీ ఎంతో ఆసక్తిగా వినేవాడిని. అవన్నీ జీవిత సత్యాలని నమ్మేవాడిని. మొదట్లో ఎక్కడెక్కడో తిరిగి హోటల్లో భోజనం చేసి ఆలస్యంగా యింటికి చేరేవాడిని. తను కనిపెట్టుకుని వుండేది. ఆకలితో తను ఎదురు చూస్తూ వుంటె నాకు ఆమె మొహం చూట్టానికే అసహ్యమేసేది. టక్కును విదిలించి నట్లు విసిరించేవాడిని. తను మౌనంగా వెళ్ళిపోయేది. రాను రాను నాలో రాక్షసత్వం పెరిగిపోయింది. ఏదో వంక పెట్టుకొని తిట్టడం, కొట్టడం కూడ మొదలు పెట్టాను. కాని తను కొట్టవద్దని ప్రతిమాలటం కానీ తిట్టవద్దని కాళ్ళమీద పడటం కానీ చేసేదికాదు. సాధారణంగా ప్రతి ఆడదీ నేననుకున్న విధంగా వుంటుందని, యిది మొండి ఘటమని, నేనంటే తనకు నిర్లక్ష్యమని మండి పడేవాడిని. అన్నింటికీ తనుమాత్రం మూగనోము పట్టినట్లుండేది. అది నన్ను మరింత మండించేది

రాను రాను మా యిద్దరిమధ్య మాటలు కాదుగదా చూపులు కూడ వుండేవి కావు ఇంతలో నాకు మా అన్నగారింటి దగ్గర 'సుమ' అనే అమ్మాయితో పరిచయమైంది. ఆ అమ్మాయి చలాకీగా, గలగల పారే సెలయేరులా వుండేది. తరచు నేను, సుమ కలిసి సినిమాలకూ, షికార్లకూ, పిక్నిక్‌లకూ వెళ్తూండేవాళ్ళం. నన్ను తనవైపు ఎంతగానో ఆకర్షించుకున్నది సుమ. సుమ మోజులో పడిన తర్వాత పరిమళను ఎలా వదుల్చుకోవాలా అని ఆలోచిస్తూ వుండేవాడిని. నా ఆలోచన కని పెట్టినట్లు పరిమళ తనలో తనే క్రుళ్ళి, కృశించి కొన్ని రోజులకు చనిపోయింది. అప్పటి నా మనస్తత్వానికి యీ సంఘటన యెంతో ఆనందాన్నిచ్చింది. నెలైనా తిరగకుండానే సుమతో నావివాహం అతివైభవంగా జరిగిపోయింది. ఆరు నెలలు యీ భూమే స్వర్గంగా మారిపోయిందా అనిపించేటంత ఆనందంగా గడిచిపోయింది. రాను రాను నా మీద మోజు తగ్గినట్లున్నది. నా వెంట ఎక్కడికీ రావటానిక్కూ ఇష్టపడేదికాదు. తను రాలేదని నేను కూడా వెళ్ళటం మానేవాడిని. కానినాతో చెప్పకుండా తన ఫ్రెండ్స్‌తో ఎక్కడెక్కడో తిరిగివచ్చేది, ఫ్రెండ్సంటే ఎవరనుకున్నావ్. మూడువంతులు బాయ్‌ఫ్రెండ్సే. ఇంటికిరాగానే "ఎక్కడికి వెళ్ళా"వని నేనడుగుతే, "ఏమిటీ ఆరాలు? నా యిష్టం వచ్చిన చోటికి వెళ్ళాను. వివరాలన్నీ మీకు చెప్పాలా, ఛీ. ఈ ఇంట్లో కదలటానిక్కూ. మెదలటానిక్కూ కూడా "అజ్ఞలు కావాలి" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకునేది. తనమీద వుండే ప్రేమతో నా మనస్సు కరిగి, దగ్గరకు తీసుకొని. కళ్ళనీళ్ళు తుడవబోతే 'ఛీ? ఇంకా సిగ్గులేకపోతే సరి!" అని ఒక తోపుతోసి వెళ్ళిపోయేది. రాను రాను నేను ఎంత ఆలస్యంగా వచ్చినా ఏమీ అనకపోయేసరికి నాకుచెప్పకుండానే రెండు రోజుల దాకా ఇంటికి రావటం మానేసేది. నేను మనసులో వుడికిపోయినా పైకిఏమనేవాడిని కాదు. ఒకసారి వెళ్ళి వారము రోజులదాకా తిరిగి రాలేదు. రెండు మూడు రోజులు చూసి, ఎక్కడికి వెళ్ళిందా అని అక్కడక్కడ ఆచూకీ తీశాను. చివరకు తెల్సిందేమిటంటే వేణు అనే ధనవంతుల అబ్బాయితో తను ఒక్కతే తిరిగిరావటానికి వెళ్ళిందని. నా మనస్సులో నేనెంతో మథనపడ్డాను. అప్పుడు గుర్తుకు వచ్చింది నా మొదటి భార్య పరిమళ, ఆమెను పెట్టిన వుసురు యిప్పుడు తగులుతున్నది. నాకు తగిన శాస్తి భగవంతుడు ఈ రూపేణా చేస్తున్నాడు. నా కింతే కావాలి... ఇటా ఏవేవో నాలో నేనే అనుకునే వాడిని, వారము రోజులయ్యాక దిగింది మహారాణీలాగా." అప్పుడు డాక్టరుగారి మొఖం చాలభయంకరంగా తయారైంది. నిజంగా ఆవిడ అప్పుడే అక్కడ వుంటే చంపేస్తారేమో అన్పించింది. "ఏమైందండి?" అని నేను చేయి పట్టుకొని కుదిపాను. అప్పుడాయన తేరుకుని, "అహఁ ఏం లేదు రమణా! కాస్త ఆ కూజాలో మంచినీళ్ళు కాసిని యిస్తావా? అని అడిగారు. నేను లేచి యిచ్చాను. గడ గడా త్రాగి, గ్లాసును టేబుల్ మీద పెట్టి కూర్చొని రమణా! నా కథతో నిన్ను విసిగిస్తున్నానేమో! అయిపోయింది. ఈ కాస్త నీకు చెప్పి నా మనసులోని భారము దించుకోనీ' అన్నారు. నేను కూర్చుంటూ, "మీరు చాల అలసిపోయారు డాక్టర్!" అన్నాను.

ఆనంద్‌గారు నీరసంగా నవ్వి, "సుమ వచ్చిందని చెప్పాను కదూ! అప్పటికి రెండు రోజుల్నుంచీ కడుపునొప్పితో బాధపడుతున్నాను. అందువల్ల మనసులో ఎంతగా మండిపోతున్నా నీరసమువల్ల మెల్లగా "ఎక్కడికి వెళ్ళావ్?" అనడిగాను. "మా పెద్దమ్మ కూతురికి జబ్బుగా వుందని తెల్సి మద్రాసు వెళ్ళాను" అని తలవంచుకొని చెప్పింది. అది అబద్ధమని తెలిసినా నేనేమీ అనలేదు. ఏమనుకుందో ఏమో ఒకవారం రోజులు ఎంతో అణకువతో ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే వున్నది. ఒకరోజు ప్రొద్దుటే లేచి చూసేసరికి తనకు సంబంధించిన వస్తువులు కానీ, తనుకాని లేదు. నేను బీరువాలో వుంచిన పదివేల రూపాయలు కూడ మాయమయినై. వినగా తెల్సినదేమిటంటే డబ్బూ, దస్కంతో వేణుతోటీసికొని లేచిపోయింది. మా వదిన చెప్పిన యీ తలలోని జుట్టంత బలగమూ నన్నుచూసి నవ్వటానికి, ఎద్దేవా చేయటానికి వచ్చారు. పేషంట్స్‌ని చూడటానికి వెళ్తే నన్నుచూసి వాళ్ళల్లో వాళ్ళే ఏవేవో గుసగుసలు చెప్పుకునేవాళ్ళు. నేనింక ఆ వూళ్ళో వుండలేక ఇంతదూరము వచ్చి ఇక్కడి అంటే పాలఘాటులో స్థిరపడ్డాను, నాకు యిద్దరు భార్యలతోను సంతానము కలుగలేదు. డబ్బుబాగా సంపాదిస్తున్నాను. మా బంధువులు వాళ్ళ పిల్లలను తీసుకొచ్చి పెంచుకోమని ఒకటే గొడవ పెడ్తున్నారు - వాళ్ళకేమాటా చెప్పకుండా ఆ పిల్లలను కొంతకాలమిక్కడ వుంచమని చెప్తున్నాను. వాళ్ళ పిల్లల సంగతి, నా డబ్బు సంగతేగానీ. నా సంగతి పట్టించుకునే వాళ్ళెవ్వరూ లేరు. నాలుగైదేళ్ళ నుంచీ కడుపులో కాన్సరు బాధ ఎక్కువైంది. వూరికే కూర్చుంటే ఆ బాధ ఎక్కువైపోతోంది, అందుకనే ఏదోపని వూపిరిసలుపని పని పెట్టుకొని తిరుగుతూవుంటాను, నా కథ విన్నావుగా రమణా! నన్ను రాక్షసుడను ఏమైనా అనుకో. ఇది నా కథ" అంటూ ముగించారు. నా మనసంతా డాక్టరుగారి పట్ల జాలితో నిండిపోయింది. ఆయన చెప్పక మొహంలోని బాధావీచికలు ఆయన పశ్చాత్తాప పడుతున్నట్లు చెప్పుతున్నాయి. పైకి అంత హుషారుగా, వుత్సాహంగా తిరిగే డాక్టరుగారి వెనక ఇంత వ్యథాపూరితమైన గాథ వుందని తెలిసి ఎంతో బాధపడ్డాను నేను. నా మనస్సులో తప్పెవరిది??? అని ఎవరో కోటిగొంతులతో ఘోషిస్తున్నట్టనిపించింది.

చాల రాత్రయింది. ఇంటికి వెళ్దామని లేచాను. రెండు నిద్రమాత్రలు చేతిలోకి తీసుకొని "మంచి నీళ్ళివ్వు రమణా!" అన్నారు డాక్టర్ ఆనంద్. "తెల్లవార్లూ నా బాధను మరపింపజేసేవి యివే" అంటూ నాకు గుడ్‌నైట్ చెప్పారు. నేను మెల్లగా మనస్సులోనే డాక్టరుగారికి జోహారులర్పిస్తూ మా ఇంటివైపు కదిలాను.

★

